క్లుప్తంగా

పాదయాత్రగా శబరికి..

స్వాములను సన్మానించిన గ్రామస్తులు



కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీదితండా గ్రామ పంచాయతీకి చెందిన కిషన్, లచ్చిరామ్, పాండునాయక్, జగన్ 45 రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించి.. పాదయాత్ర ద్వారా శబరిమల యాత్ర పూర్తిచేసుకుని ఇటీవల స్వగ్రామం చేరుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం మండల పరిధిలోని కర్కల్‌పహాడ్‌లో స్థానిక అయ్యప్ప మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రవీందర్‌రెడ్డి, హరి, నర్సింగ్, అశోక్, శ్రీను గురుస్వామి, స్వాములు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో మున్సిపాలిటీకి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోర్డును తొలగించి స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ రవీందర్ రెడ్డి మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదే భూమిని కొందరు కబ్జాకు ప్రయత్నిస్తుండగా స్థానికుల ఆందోళనతో దిగివచ్చిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి 14 గుంటల భూమిని గుర్తించి హద్దులను, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు హెచ్చరిక బోర్డును తొలగించి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారని.. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి రవీందర్

కడ్తాల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీడీఎస్ జేఏసీ కేంద్ర సంఘం పిలుపు మేరకు డిసెంబర్ 12వ తేదీ నుంచి గ్రామీణ తపాల ఉద్యోగులు చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) వనపర్తి డివిజన్ కార్యదర్శి రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ తపాల ఉద్యోగుల డిమాండ్లైన.. 8 గంటల పని, పెన్షన్, జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలని, పెయిడ్ లీవ్‌లను 180 రోజుల వరకు దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కమలేశ్ చంద్ర కమిటీ ఇచ్చిన సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో తపాలా ఉద్యోగుల సమస్యలను చర్చించి, కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

మహిళలెవరూ టికెట్ తీసుకోవద్దు: బీజేపీ

తలకొండపల్లి: మహిళలెవరూ ఆర్టీసీ బస్సుల్లో టికెట్ తీసుకోవద్దని.. ఉచితంగానే ప్రయాణించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దుగ్గపురం తిరుపతి అన్నారు. మంగళవారం తలకొండపల్లిలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రతి మహిళ టికెట్ తీసుకోవద్దని ఉచితంగానే ప్రయాణించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో పాడి పశువులు మృత్యువాత

కందుకూరు: విద్యుదాఘాతంతో రెండు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం గ్రామానికి చెందిన గడ్డగూటి భిక్షపతి ఆవు, గేదెను మేపడానికి పొలాలకు తీసుకెళ్లాడు. అవి మేసే క్రమంలో విద్యుత్ తీగ తెగిపడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ దాదాపుగా రూ.1లక్షకు పైగా ఉంటుందని బాధితుడు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.

మహిళకు అవకాశం ఇవ్వాలి: పద్మావతి

చాదర్‌ఘాట్: తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవిని మహిళకు కేటాయించాలని ప్రముఖ కళాకారిణి, రాష్ట్రపతి అవార్డ్ గ్రహీత పద్మావతి కోరారు. మంగళవారం ఆమె మలక్‌పేటలో మాట్లాడుతూ, దివ్యాంగ మహిళలకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న విలువ తెలంగాణ ఏర్పడ్డాక పోయిందన్నారు. అధిక వైకల్యం ఉన్నవారి సమస్యలు పరిష్కారం కావాలంటే వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి చైర్ పర్సన్‌గా అవకాశం ఇవ్వాలన్నారు. దశాబ్ద కాలంగా దివ్యాంగులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు సమాన అవకాశాలు ఇస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

మెజార్టీ ఎలా తగ్గింది

- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్ఎస్ కేడర్
- పెద్ద లీడర్ల గ్రామాల్లోనే కారుకు తక్కువ ఓట్లు
- తప్పెక్కడ జరిగిందో తెలియక తలలు పట్టుకుంటున్న నేతలు
- పార్టీ మారే యోచనలో సీనియర్లు!



యాచారం: మంచిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు (ఫైల్)

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిని బీఆర్ఎస్ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. పోలింగ్‌కు ముందు మా గ్రామంలో మెజార్టీ వస్తుంది. బూత్ స్థాయిలో మనమే బలంగా ఉన్నాం, ఇతర పార్టీల వారు మనకు దరిదాపుల్లోకి కూడా రారంటూ బీరాలు పలికిన నేతలు ఆ గ్రామాల్లో కారు గుర్తుకు పడిన ఓట్లు చూసి బిత్తరపోతున్నారు. బూత్ స్థాయిలో విస్తృత ప్రచారం, నిత్యం విందు భోజనాలు, జేబు నిండా డబ్బు అందజేసినా.. మెజార్టీ మైనస్‌గా ఉండటం పట్ల కిందిస్థాయి కార్యకర్తలు తల్లడిల్లిపోతున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 47,948 ఓటర్లు ఉండగా.. 38,489 ఓట్లు పోలయ్యాయి. యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి ఫార్మా భూబాధిత గ్రామాల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ రాదని ముందు నుంచే అభిప్రాయం ఉన్నప్పటికీ డబ్బుతో వ్యతిరేకతను తగ్గించవచ్చనే అభిప్రాయం నెలకొంది. ఆ కోణంలో కూడ బీఆర్ఎస్ అధిష్టానం కృషి చేసింది. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో ఫార్మాసిటీ ప్రభావం, నస్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాల్లో నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల కౌలు రైతులంతా కాంగ్రెస్‌కే మద్దతిచ్చారు. ఈ ఆరు గ్రామాల్లోనే కారు గుర్తుకంటే చేతి గుర్తుకు 3వేలకు పైగా మెజార్టీ వచ్చింది. ప్రచారం బాగా చేసినా మెజార్టీ ఎలా తగ్గిందనే వాదన నేతల్లో ఉంది.

పేరున్న లీడర్ల గ్రామాల్లో తక్కువ ఓట్లు..

యాచారం మండలంలోని బీఆర్ఎస్ పెద్ద లీడర్లుగా పేరొందిన గ్రామాల్లోనే కారు గుర్తు కంటే చేతి గుర్తుకు అధిక ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ గ్రామమైన మంతన్‌గౌరెల్లిలో చేతి గుర్తుకు 400కు పైగా మెజార్టీ వచ్చింది. ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా గ్రామమైన నక్కర్తమేడిపల్లిలో 200కు పైగా మెజార్టీ, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ గ్రామం మాల్‌లో 300కు పైగా మెజార్టీ, మాజీ ఎంపీపీ వర్త్యవత్ రజిత గ్రామం నందివనపర్తిలో 400కు పైగా మెజార్టీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి గ్రామం గునుగల్‌లో 250కు పైగా మెజార్టీ వచ్చింది. యాచారం గ్రామంలో చేతి గుర్తుకు ఏకంగా 600కు పైగానే మెజార్టీ వచ్చింది. అదే విధంగా బీఆర్ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులున్న గ్రామాల్లో కూడా కారు గుర్తు కంటే చేతిగుర్తుపై అత్యధికంగా ఓట్లు వచ్చాయి. గ్రామాల్లో పెద్ద లీడర్ల వన్‌మ్యాన్ షో.. ఇచ్చిన డబ్బులు కార్యకర్తలకు పంచకపోవడం, అంతా తాను చెప్పినట్లే వినాలనే గర్వం ఉండి సమన్వయం లేక కొంపముంచేలా చేసింది.

హస్తం గూటికి వెళ్దామా..

ఇన్నాళ్లు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అండతో గ్రామాల్లో వన్‌మ్యాన్ షోతో చెలరేగిపోయిన బీఆర్ఎస్ నేతల్లో కొందరు నాయకులు కారు దిగి హస్తం గూటికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిపాలైన మరుసటి రోజు నుంచే కాంగ్రెస్‌లోని పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు మండలంలో చర్చ జరుగుతుంది. కారు దిగి కాంగ్రెస్‌లోకి వస్తే మళ్లీ మాకే సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా పోటీచేసే అవకాశం కల్పిస్తారా.. లేదా మరేదైన పదవులు దక్కుతాయా.. అంటూ కాంగ్రెస్ నేతలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. గ్రామాల్లోని పెద్ద లీడర్ల వన్‌మ్యాన్ షోతో ఇబ్బందులు పడిన కిందిస్థాయి కార్యకర్తలు బీఆర్ఎస్‌లో ఉండి.. ప్రచారం నిర్వహించి చేతికి ఓటేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉంటే ఇన్నాళ్ల మాదిరిగా పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వాధికారులు తమ మాట వినరనే ఆందోళన కూడా బీఆర్ఎస్ నేతల్లో నెలకొంది. ఏదైనా మరికొన్ని రోజుల్లో యాచారం మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది.



అభిషేక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

యాదగిరిగుట్టకు పాదయాత్రగా..

- మల్‌రెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి
- ఘన స్వాగతం పలుకుతున్న నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలవడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా మంగళవారం మల్‌రెడ్డి తనయుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతో పాటు 40 ఏళ్ల తర్వాత ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా మొక్కుచెల్లించేందుకు ఇబ్రహీపట్నం నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్రగా బయలుదేరినట్లు తెలిపారు. ఆయనకు కాంగ్రెస్ నాయకులు, మల్‌రెడ్డి అభిమానులు మార్గ మధ్యలో స్వాగతం పలుకుతున్నారు.

దంచిన వాన

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ముసురు వర్షం కురిసింది. ఎన్నికల నేపథ్యంలో కూలీల ఇబ్బందులతో ఈ దఫా రైతులు వరి పంటను ఆలస్యంగా కోశారు. వరి ధాన్యం కుప్పలు ఇంకా వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లోనే ఉన్నాయి. యాచారం, మంతన్‌గౌరెల్లి, మాల్, కొత్తపల్లి, నందివనపర్తి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో ముసురు వర్షంతో ధాన్యం తడిసిపోయింది. అయితే మధ్యాహ్నం కొద్దిసేపు వర్షం తగ్గడంతో రైతులు ధాన్యం ఉన్న పడాలను తీసి ఆరబెట్టారు. ధాన్యం కొనుగోలు సమయంలో అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని రైతులు కోరుతున్నారు.

చల్లబడిన వాతావరణం..

ఇబ్రహీంపట్నం: మిచాంగ్ తుఫాన్‌ప్రభావంతో ఇబ్రహీంపట్నంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు కురిసాయి. చిరు జల్లులకు తోడు చల్లని గాలులు వీస్తుండటంతో ప్రజలు చలికి వణికిపోయారు. పిల్లలు, వృద్ధులు ఇంటికే పరిమితమయ్యారు.తుఫాన్ ఎఫెక్ట్ మరో రెండు రోజుల పాటు ఉంటుందని అధికారులు చెబుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు.



యాచారం: తక్కళ్లపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు

మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దినందుకే ప్రజలు తనకు పట్టంకట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెట్టింపు ఉత్సాహంతో మరింత అభివృద్ధి చేస్తానని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారితో కలిసి కంచర్ల శివారెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని, తగిన ప్రణాళిక సిద్ధం చేసి అభివృద్ధి చేస్తానని అన్నారు. నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, శ్రీనివాస్‌నాయక్, ఆదిలక్ష్మి, విజయ పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు




శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం

ముస్తాబైన ఆలయం

- నేటి నుంచి శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

మహేశ్వరం: మండలంలోని అమీర్‌పేట్ గ్రామంలో కొలువైన శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి 15వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఆలయం మొత్తం విద్యుద్దీపాలు, రంగులతో ముస్తాబైంది. ఏటా ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. గత కొన్నేళ్ల నుంచి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మహాగణపతి ఆరాధన, పుణ్యవచనము, రక్షాబంధనము, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, ప్రసాద వితరణ, మూలదేవత హోమము నిర్వహిస్తారు. గురువారం శ్రీవెంకటేశ్వరస్వామి వార్ల అభిషేకం, మూలదేవత హోమములు, ప్రసాద వితరణ, లక్ష్మీదేవి కుంకుమార్చన చేయనున్నారు. ప్రత్యేక పూజలు కూడా చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పనులు పూర్తయ్యేనా?



ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం

- అర్ధంతరంగా నిలిచిన తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం
- ఆరు నెలలుగా ఇరుకు గదుల్లో ఉద్యోగుల అవస్థలు
- కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలంటున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నిజాం కాలంలో నిర్మించిన తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరడంతో గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో కూల్చివేశారు. ఆదే స్థానంలో ఆరు నెలల్లో కొత్త భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. అనుకున్నదే తడువుగా గతేడాది ఫిబ్రవరి చివరిలో అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటివరకు తహసీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా జెడ్పీ విశ్రాంతి భవనంలోకి తరలించారు. అప్పటినుంచి సరైన సెక్యూరిటీ సదుపాయం లేని ఇరుకు గదుల్లో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. భూ రిజిస్ట్రేషన్లతోపాటు వివిధ పనులపై వచ్చేవారికి ఈ ఇరుకైన కార్యాలయంలో ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం బటయ కూర్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తిప్పలు ఎప్పటికి తీరుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. .

నిధుల సమస్య...

ఆరు నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని చెప్పినప్పటికీ అందుకు అవసరమైన నిధులను సమకూర్చకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) కింద 1.25 కోట్ల నిధులను తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించారు. ఆ నిధులున్నంత వరకు కాంట్రాక్టర్ పనులుచేసి ఆతదుపరి చేతులు ఎత్తేశాడు. స్లాబ్‌లు, ఇటుకలతో గోడల నిర్మాణం వరకు మాత్రమే పనులు జరిగాయి. అదనపు నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయడం మానేశాడని అధికారులు తెలిపారు. మరో కోటి రూపాయలు కేటాయిస్తే ఈ పనులు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుంది. ఆ దిశగా నిధులు మంజూరు కాకపోవడంతో అర్థాంతరంగా ఈ నిర్మాణం ఆగిపోయింది. సంవత్సర కాలంగా పనులు నిలిచిపోవడంతో కట్టిన కట్టడాలు కూడా దెబ్బతింటున్నాయి.

నిధుల కేటాయింపు జరిగేనా..?

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైన తహసీల్దార్ భవన నిర్మాణ పనులకు కొత్తగా వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన నిధుల కేటాయింపులు వెంటనే జరిగేనా అనే సందేహాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక భవనంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కొత్తగా వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసేవిధంగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషిచేయాలని కోరుతున్నారు.అదనపు నిధులు కేటాయిస్తేనే పనులు పునఃప్రారంభం అవుతాయి. అంతవరకు ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు.

నివేదిక పంపాం



అదనపు నిధులు మంజూరు కాకపోవడంతో తహసీల్దార్ భవన నిర్మాణ పనులు ఆగాయి. సుమారు కోటి రూపాయలు మంజూరైతే ఈ భవన నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ నిధులకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం.

– ఇంద్రసేనారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఇబ్రహీంపట్నం

కాంగ్రెస్ నేతల సంబురాలు

- సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ప్రకటించడంపై హర్షం



ఆమనగల్లు: విఠాయిపల్లిలో నేతల సంబురాలు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర రెండో, కాంగ్రెస్ తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న ఎనుముల రేవంత్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంగళవారం సీఎం పదవికి రేవంత్ పేరు ప్రకటించడంపై నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుడు బర్ల జగదీశ్‌యాదవ్ ఈ సందర్భంగా రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమకారులకు అండగా ఉంటానన్న రేవంత్‌రెడ్డికి స్వచ్ఛందంగా అందరూ మద్దతుగా నిలిచారన్నారు. ప్రజల, ఉద్యమకారుల ఆశలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

నేతల హర్షం..

రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడం పట్ల ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం సీఎల్పీ లీడర్‌గా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని అధిష్టానం ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయంతో ఆ పార్టీ శ్రేణుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అదేవిధంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని స్థానిక నేతలు భావిస్తున్నారు.

ఆమనగల్లు మున్సిపాలిటీలో..

ఆమనగల్లు: రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడంతో ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు శ్రీధర్‌నాయక్, రవి, తిరుమలేశ్, గోపి, హరి, రాజు, మహేశ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి ఎంపిక పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, జంగయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణనాయక్, మేడిగడ్డ రవీందర్‌నాయక్, అలీం, నాజర్, శ్రీకాంత్, ఫరీద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కడ్తాల్ మండలంలో

కడ్తాల్: రేవంత్‌రెడ్డిని సీఎల్‌పీ నాయకుడిగా (సీఎం)గా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేయడం పట్ల మండల కేంద్రంలో రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ ఆధ్వర్యంలో నేతలు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. ఆసీఫ్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి రేవంత్‌రెడ్డి చేసిన కృషిని పార్టీ అధిష్టానం గుర్తించిందని.. ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం అభ్యర్థిగా ప్రకటించిందని అన్నారు. నాయకులు.. సుధాకర్‌గౌడ్, రాజేశ్, ప్రవీణ్‌గౌడ్, రమేశ్, చందు, మహేశ్, శ్రీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మన్, ఇమ్రాన్‌బాబా, నరేశ్, వంశీ తదితరులు ఉన్నారు.

అంచెలంచెలుగా..

తలకొండపల్లి: రాష్ట్ర సీఎంగా ఎనుముల రేవంత్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ యాదయ్య హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చుక్కాపూర్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం రేవంత్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రేవంత్ ప్రస్థానం మొదలైనప్పటి నుంచి సీఎంగా ఎదిగిన తీరు అభినందనీయం అన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

హుడాకాంప్లెక్స్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయపురికాలనీ భవన్‌లో సీనియర్ సిటిజన్స్‌కు మొబైల్ మెడికల్ కేర్ యూనిట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం సలహాదారు గోవర్ధన్,కాలనీవాసులు పాల్గొన్నారు.

అందరికీ రుణపడి ఉంటా

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మంచి పాలన అందిస్తాననే నమ్మకంతో తనను నియోజకవర్గ ప్రజలు మరోసారి గెలిపించారని, వారందరికీ రుణపడి ఉంటానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సబితా ఇంద్రారెడ్డి మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ, తన విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచి మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి సబితారెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, బీర బాలకిషన్, పెండ్యాల నగేష్, సాజిద్, లోకసాని కొండల్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, శ్యామల శైలజ, ఊర్మిలారెడ్డి, సునీతాపటేల్, శ్రీనివాస్, శేఖర్, కొంద్రశ్రీనివాస్, రాజేష్‌గౌడ్, రాజు, రవీందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



శివరామాలయాలకు వెళ్లే బీటీ రోడ్డు

కంకర తేలింది

- అధ్వానంగా శివరామాలయాల బీటీ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివరామాలయాకు వెళ్లే రహదారి గుంతపడి అధ్వాన్నంగా మారింది. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి మైసిగండి సమీపంలో కిలో మీటరు దూరంలో శివరామాలయాలు ఉన్నాయి. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు 20 ఏళ్ల క్రితం ఈ మార్గంలో బీటీ రోడ్డు వేశారు. అయితే ప్రస్తుతం అది పూర్తిగా కంకర తేలి మట్టిరోడ్డును తలపిస్తూ గోతులమయంగా మారింది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. అధికారులు బీటీ రోడ్డును పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు.